క్లుప్తంగా

నేటి మధ్యాహ్నం నుంచి పింఛన్ల పంపిణీ

ఏలూరు టౌన్ : బుధవారం మధ్యాహ్నం నుంచి సామాజిక పింఛన్ల పంపిణీకి చర్యలు చేపట్టామని ఏలూరు నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ తెలిపారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ మంచంపై ఉన్న వారు, వికలాంగులకు మాత్రమే ఇళ్లకు వెళ్లి పింఛన్లు ఇచ్చేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. సచివాలయాల వద్ద అవసరాన్ని బట్టి టెంట్లు వేయటం, తాగునీటి సౌకర్యం కల్పించేలా ఏర్పాట్లు చేశామని, ఒక్కో సచివాలయంలో ఏడు కౌంటర్లు ఏర్పాటు చేశామని తెలిపారు. ఏలూరు నగరంలో 29,406 మందికి పింఛన్లు అందించనున్నట్టు చెప్పారు. నగరంలోని 79 సచివాలయాల్లో 553 మంది సచివాలయ సెక్రటరీలు పింఛన్లు పంపిణీ చేస్తారని తెలిపారు.

న్యాయవాదుల గుమాస్తాల సంఘ అధ్యక్షుడిగా రాము

ఏలూరు (టూటౌన్) : ఏలూరు న్యాయవాదుల గుమాస్తాల సంఘ అధ్యక్షునిగా నల్లా రాము ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయవాదుల గుమాస్తాల అసోసియేషన్ బిల్డింగ్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షునిగా ఎన్‌వీఎస్ఎస్ ప్రకాశరావు, ఉపాధ్యక్షుడిగా పి.శ్రీరంజన్, కార్యదర్శిగా బేతపూడి శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీగా ఏవీ రామారావు, కోశాధికారిగా బత్తిన గోపి, మహిళా ప్రతినిధిగా యజ్జల గాయత్రిలతో పాటు మరో 11 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గం పదవీ కాలం 2024–25 మధ్య ఉంటుందని అధ్యక్షుడు నల్లా రాము తెలిపారు.

కుమ్మరి రేవు ప్రాంతానికి తాగునీరందించాలి

కమిషనర్‌కు మహిళల వినతి

ఏలూరు (టూటౌన్): కుమ్మరిరేవు ప్రాంతంలో మంచినీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఆ ప్రాంతానికి చెందిన మహిళలు నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.వెంకట కృష్ణకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. కుమ్మరిరేవు ప్రాంత మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చేపట్టాలని వారు కోరారు. ఏటిగట్టు ప్రాంతంలోని 200 కుటుంబాలకు మంచినీళ్లు దొరకడం లేదని, వీరికి ట్యాంకర్ల ద్వారానైనా మంచినీటిని అందించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ.. కుమ్మరిరేవు ఏటిగట్టు ప్రాంతంలో బోర్‌వెల్ వేస్తామన్నారు. కుమ్మరిరేవు ప్రాంతానికి ట్యాంకర్ల ద్వారా తాత్కాలికంగా మంచినీటిని సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. వినతిపత్రం ఇచ్చినవారిలో సీహెచ్ కళావతి, కె.అప్పలనరసమ్మ, కె.సావిత్రి, కె.బేబి తదితరులు ఉన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి



మాట్లాడుతున్న సర్వశిక్షా అభియాన్ అసిస్టెంట్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ సోమశేఖర్

ఏలూరు రూరల్ : రివాల్వింగ్ ఫండ్స్‌తో పాఠశాలల్లో మరిన్ని మౌలిక వసతులు కల్పించాలని సర్వశిక్షా అభియాన్ అసిస్టెంట్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ బి.సోమశేఖర్ అన్నారు. మంగళవారం ఏలూరు మండల పరిషత్ సమావేశ మందిరంలో ఏలూరు రూరల్, అర్బన్ ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులతో ఆయన సమావేశం నిర్వహించారు. తాగునీరు, మరుగుదొడ్లు, పాఠశాల ఆటస్థలాలను అభివృద్ధి చేయాలన్నారు. ఇప్పటికే చేపట్టిన పనులను పూర్తి చేయాలని సూచించారు. పాఠశాలల్లో ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఐఎఫ్‌పీ ప్యానల్స్, స్మార్ట్ టీవీల నిర్వహణ, పిల్లలు ఉపయోగిస్తున్న ట్యాబ్స్‌పైనా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. రాబోయే ఎస్ఏ–2 పరీక్షల నిర్వహణ, మార్కులు ఆన్‌లైన్ చేయడంపై శ్రద్ధ వహించాలని ఎంఈఓ ఆర్ రంగయ్య సూచించారు. ఎంపీడీఓ బి.ప్రణవి అధ్యక్షతన నిర్వహించి ఈ సమావేశంలో ఎంఈఓ–1 రవిప్రకాష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పింఛన్ అందక ఆందోళన

- వలంటీర్ల కోసం ఎదురుచూపు
- అడ్డుకుంటున్న వారికి తమ ఊసురు తప్పదంటున్న లబ్ధిదారులు



చొదిమెళ్లలో వృద్ధులకు ఫించన్ అందిస్తున్న వాలంటీర్(ఫైల్)



25 డివిజన్‌లో లబ్దిదారులకు ఇంటి వద్దనే ఫించన్ అందిస్తున్న వాలంటీర్

ఏలూరు రూరల్: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచీ ప్రతి నెలా ఒకటో తేదీ తెల్లవారుజాము నుంచే లబ్ధిదారులు వలంటీర్ల ద్వారా పింఛన్ సొమ్ము అందుకునే వారు. కూటమి పార్టీల కుట్ర కారణంగా ఈ నెల రెండో తేదీన కూడా పింఛన్ సొమ్ము అందకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. తెల్లవారకముందే తలుపుతట్టి పింఛన్ ఇచ్చే వలంటీర్లపై టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కక్ష కట్టారని, తమకు పింఛన్ పంపిణీ చేయకుండా అడ్డుకున్నారని వాపోతున్నారు. వలంటీర్ల సేవలను అవమానించడం సిగ్గుచేటని చెబుతున్నారు. కరోనా కష్టకాలంలో వలంటీర్ల సాయంతో వైద్య పరీక్షలు చేయించుకున్నామని, అత్యవసర సమయాల్లో ఇంటికే నిత్యావసర సరుకులు అందుకున్నామని గుర్తుచేసుకుంటున్నారు. వలంటరీర్ల సేవలకు రాజకీయం పులమడం మంచిది కాదని, తమకు కష్టాలు తెచ్చిపెట్టడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సేవలను అడ్డుకోవడం అన్యాయం



రెండో తేదీ వచ్చినా పింఛన్ సొమ్ము అందలేదు. ఐదేళ్లలో ఎప్పుడూ ఇలా జరగలేదు. టీడీపీ నాయకులు వలంటీర్లపై అసత్య ప్రచారం చేస్తున్నారు. వలంటీర్ వ్యవస్థ వచ్చిన తర్వాతే మాకు ప్రభుత్వ పథకాలు వచ్చాయి. వలంటీర్ మా ఇంటికొచ్చి దరఖాస్తు పూర్తి చేయించింది. ఇంటి స్థలం మంజూరు చేయించింది. ఒక్క పైసా కూడా తీసుకోలేదు. అలాంటి వాళ్లపై అసత్యాలు చెప్పి అడ్డుకోవడం బాధగా ఉంది.

– జి.వెంకటేశ్వరమ్మ, పెదయాగనమిల్లి

వలంటీర్ల సేవలు అమోఘం



నాకు జగన్ ఇచ్చిన కానుక వలంటీర్ భవానీ. నా కుటుంబంలో వ్యక్తిగానే భావిస్తాను. నాకు ఏ కష్టం వచ్చినా సాయం చేస్తుంది. ఫోన్ చేస్తేచాలు ఇంటికి వచ్చి ఏం కావాలంటుంది. నెలనెలా 1వ తేదీన పింఛన్ ఇస్తుంది. ఇక్కరోజు కూడా ఆలస్యం చేయదు. ఆ డబ్బుతోనే నేడు మందులు కొనుక్కొంటున్నాను. ఇప్పుడు వలంటీర్ మా ఇంటికి రాకపోతే చాలా ఆందోళనగా ఉంది. వలంటీర్లపై అబద్దాలు చెబుతున్న వారికి తగిన శాస్తి జరుగుతుంది.

– బలే పుల్లమ్మ, పెదయాగనమిల్లి

కష్టాలపాలు చేస్తున్నారు



వలంటీర్లు తప్పు చేస్తున్నారని చెప్పిన వారికి ప్రజలే బుద్ధి చెబుతారు. వలంటీర్లపై ఫిర్యాదు చేసిన వారు 1వ తేదీనే పింఛన్ అందక పోతే వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు ఎన్ని అవస్థలు పడుతున్నారో తెలుసుకోవాలి. ఇప్పుడు పింఛన్ కోసం సచివాలయం వద్ద పడిగాపులు పడాలి. చంద్రబాబు హయాంలో ఇలానే జరిగింది. రోజుల తరబడి పంచాయతీ కార్యాలయానికి వెళ్లి ఎండలో గంటల తరబడి నిలబడి పింఛన్ తీసుకునేవాళ్లం.

– యడ్ల లక్ష్మి, వైఎస్సార్ కాలనీ

పేదలను పట్టించుకోండి



వలంటీర్ల వల్ల పేదలకు జరిగే మేలు తెలిస్తే తప్పుగా మాట్లాడరు. ఐదేళ్లుగా వలంటీర్లు నా ఇంటికొచ్చి పింఛన్ ఇస్తున్నారు. ఇప్పుడు ఎన్నికలు వచ్చాయని వలంటీర్లపై ఫిర్యాదు చేసి అడ్డుకోవడం అన్యాయం. ఫిర్యాదు చేసేముందు పేదలకు ఏ నష్టం వస్తుందో తెలుసుకోవాలి. ఇప్పుడు మా కష్టాలు ఎవరు తీర్చుతారు? మాకు ఇంటికి వచ్చి పింఛన్ ఎవరిస్తారు? ప్రభుత్వ పథకాలు గురించి మొట్టమొదట మాకు చెప్పింది వలంటీర్. వలంటీర్లు ఉంటేనే పేదలకు మేలు జరుగుతుంది.

– ఎస్ కుమారి, మల్కాపురం

టీడీపీ వల్లే కష్టాలు



టీడీపీ నాయకులు వలంటీర్లను అడ్డుకోవడం వల్లే రెండు నెలలు పింఛన్ కోసం మాకు కష్టాలు తప్పవు. ఎండలో సచివాలయం వద్ద గంటల తరబడి నిలబడి పింఛన్ తీసుకోవాలంటే ఎంతో బాధగా ఉంటుందో తెలుసుకోవాలి. ఏమీ తెలియకుండా వలంటీర్లను అడ్డుకుని, పేదల పింఛన్ పంపిణీని నిపివేయడం న్యాయమేనా? కరోనా సమయంలో సైతం ఇంటింటికీ తిరిగి జ్వరం ఉందా? లేదా అని పరీక్షలు చేయించారు. మందులు ఇప్పించారు. ఎన్నికల తర్వాత మళ్లీ వలంటీర్లు పింఛన్ ఇస్తారు.

– వరద పార్వతి, శనివారపుపేట

పోషకాహారం అందించాలి



వంటశాలను పరిశీలిస్తున్న డీఎల్ఎస్ఏ జిల్లా కార్యదర్శి కె.రత్నప్రసాద్

ఏలూరు (టూటౌన్): వసతి గృహం బాలురకు పోషక విలువలతో కూడిన నాణ్యమైన ఆహారాన్ని అందించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి కె.రత్నప్రసాద్ అన్నారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ సి.పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో ఆయన మంగళవారం స్థానిక శనివారపుపేటలోని బాలుర వసతి గృహాన్ని సందర్శించారు. బాలురకు అందుతోన్న వసతులపైనా, ఆహార పదార్థాల నాణ్యతపైనా ఆరా తీశారు. శుభ్రత విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అబ్జర్వేషన్‌లో ఉన్న బాలురకు న్యాయ సదుపాయాలు, తల్లిదండ్రుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రాబోయే పరీక్షల్లో అత్యధిక మార్కులు పొందిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందిస్తామని, విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. వసతి గృహం సూపరింటెండెంట్ పి.శ్రీవల్లి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రీ గ్రాడ్యుయేషన్ వేడుకలో కలెక్టర్ దంపతులు



కలెక్టర్ కుమార్తె రాశ్మి సహస్ర అన్వితకు సర్టిఫికెట్ అందించిన సీఆర్ఆర్ స్కూల్ ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ దంపతులు తమ పిల్లల ప్రీ గ్రాడ్యుయేషన్ కార్యక్రమానికి హాజరై సాధారణ తల్లిదండ్రుల్లానే ముచ్చటపడ్డారు. స్థానిక సీఆర్ఆర్ పబ్లిక్ స్కూల్‌లో మంగళవారం నిర్వహించిన ప్రీ ప్రైమరీ గ్రాడ్యుయేషన్ డే వేడుకలో పాల్గొన్నారు. ఈ పాఠశాలలో ప్రీ ప్రైమరీ చదువుతున్న తమ చిన్నారి రాశ్మి సహస్ర అన్విత గ్రాడ్యుయేషన్ కార్యక్రమాన్ని తిలకించారు. జిల్లా కలెక్టర్ దంపతులు కార్యక్రమంలో పాల్గొన్ని తమ విలువైన సమయాన్ని వెచ్చించినందుకు పాఠశాల యాజమాన్యం కృతజ్ఞతలు తెలిపింది. ఈ సందర్భంగా సీఆర్ఆర్ విద్యాసంస్థల సెక్రటరీ ఎంబీఎస్‌వీ ప్రసాద్, జాయింట్ సెక్రెటరీ కొడాలి వెంకట సుబ్బారావు, ప్రిన్సిపాల్ సాయికుమారి శంకర్ మాట్లాడారు. ప్రీ ప్రైమరీ ఐ విద్యార్థులు నృత్య ప్రదర్శనలు అలరించాయి. ప్రీ ప్రైమరీ ఐఐ నుంచి ఫస్ట్ క్లాస్‌కు ప్రవేశం పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. పాఠశాల కరస్పాండెంట్ వంకినేని రఘు కుమార్, పాఠశాల డైరెక్టర్ రాజ కళ శ్రీధరి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇన్‌చార్జి చౌదరి రాజీనామా

దెందులూరు: కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల ధోరణిని వ్యతిరేకిస్తూ ఆమె దిష్టిబొమ్మను ఆపార్టీ దెందులూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, రాష్ట్ర అధికార ప్రతినిధి డీవీఆర్‌కే చౌదరి ఏలూరులో నాయకులతో కలిసి దహనం చేశారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డిని తరుచూ విమర్శించడంతో షర్మిల పద్ధతులు నచ్చక రాజీనామా చేస్తున్నట్టు తెలిపారు. చలసాని ఉదయ్ కిరణ్, కంచెర్ల గంగాధరరావు, మిడతా వెంకట్, నందిపాము కృపావర్మ, నిమ్మలూరి రాజీవ్‌కుమార్ తదితరులు తమ రాజీనామా పత్రాలను జాతీయ అధ్యక్షుడు ఖర్గేకు, షర్మిలకు పంపారు.

వార్షిక పరీక్షలకు ఏర్పాట్లు

గణపవరం: త్వరలో ప్రారంభం కానున్న వార్షిక పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశామని గణపవరం ఎంఈవో పుచ్చల శేషు అన్నారు. మంగళవారం గణపవరం మండలం కాశిపాడులో ప్రాథమిక పాఠశాలలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. సిలబస్ పూర్తయిందా లేదా అన్నది ఆరా తీశారు. విద్యార్థుల నోటు పుస్తకాలు, వర్క్‌బుక్‌లు తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. పరీక్షల సన్నద్ధతపై విద్యార్థులను పరీక్షించారు. పరీక్షలను ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

వలంటీర్ల వ్యవస్థపై అక్కసు దారుణం

- టీడీపీ మూల్యం చెల్లించక తప్పదు
- ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి



ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

దెందులూరు: వలంటీర్ వ్యవస్థపై అక్కసుతో పింఛన్ల పంపిణీని అడ్డుకోవడం దారుణమని, అవ్వా, తాతల ఉసురుపోసుకుంటున్న టీడీపీ అధినేత చంద్రబాబు తగిన మూల్యం చెల్లించక తప్పదని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ ఆధ్వర్యంలో సాగిన ఈ రాక్షస కుట్రకు వృద్ధులు, అంధులు, వికలాంగులు, వితంతు మహిళలు బలవుతున్నారన్నారు. వాస్తవాలు ఇలా ఉంటే టీడీపీ అసత్య ప్రచారం చేయడం రాష్ట్ర ప్రజలందరూ గమనిస్తున్నారని ఎమ్మెల్యే ఖండించారు. వలంటీర్లపై ఈసీకి ఫిర్యాదు చేసి ఏప్రిల్ 1న పింఛన్ పంపిణీలో జాప్యం కలిగించేలా చేసిన టీడీపీపై ఎమ్మెల్యే కొఠారు తీవ్రంగా మండిపడ్డారు. తన వాళ్ల సంస్థ సిటిజన్ ఫర్ డెమోక్రసీ ద్వారా చంద్రబాబు ఆడిన రాక్షస క్రీడలో లక్షలాది మంది ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రజల జీవితాలతో పెనవేసుకున్న వలంటీర్ల వ్యవస్థను తీసుకువచ్చిన జగనన్నపై కక్ష సాధింపుగా టీడీపీ ఈ ప్రజా వ్యతిరేక చర్యకు పూనుకుందన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే ఇంకా ఏం దాష్టీకాలు చేస్తారో, తమకు ఇంకెన్ని కష్టాలు తెచ్చి పెడతారోనని ప్రజలు అనుకుంటున్నారని తెలిపారు. ఎన్నికల ముందు చంద్రబాబు నిజస్వరూపాన్ని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. పెన్షన్ల విషయంలో టీడీపీ చేస్తున్న నీచమైన అసత్య ప్రచారాన్ని ఎమ్మెల్యే తీవ్రంగా ఖండించారు.

పింఛన్ల పంపిణీని అడ్డుకునేందుకు చంద్రబాబు కుట్ర



చినసత్యవోలులో ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

పెదపాడు: వృద్ధులకు వికలాంగులకు పింఛన్లు ఇవ్వకుండా అడ్డుకునేందుకు చంద్రబాబు ఆరాటపడుతూ కుట్రలకు పాల్పడుతున్నారని ఎన్నికల కమిషన్‌కు తన అనుచరులతో ఫిర్యాదు చేశారని జెడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. ఎన్ని ఎత్తుగడలు వేసినా పింఛన్ల పంపిణీని ఆపడం ఎవరికీ సాధ్యం కాదని జెడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ తెలిపారు. పెదపాడు మండలంలోని చిన సత్యవోలులో నేను సిద్ధం మా ఊరు సిద్ధం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబుకు ఏనాడైనా వృద్ధులు, వికలాంగుల ఇంటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు అందించాలన్న ఆలోచన వచ్చిందా అని ప్రశ్నించారు. చంద్రబాబు హయాంలో పింఛన్లు ఇవ్వాలంటే అప్పటి వరకూ లబ్ధిపొందుతున్న వ్యక్తి మరణిస్తే వారి స్థానంలో మరొకరికి ఇచ్చేవారని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు జగన్‌మోహన్‌రరెడ్డి అందిస్తున్నారని గుర్తు చేసారు. పేదల పక్షాన నిలిచేది జగన్‌మోహన్‌రెడ్డి అని, పెత్తందార్లు, స్వార్థ పరుల పక్షాన నిలబడేది చంద్రబాబు అని స్పష్టం చేసారు. రాబోయే ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని బలపర్చాల్సిన అవసరముందని చెప్పారు. ఫ్యాను గుర్తుపై ఓటు వేసి పార్టీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, వడ్డి కార్పొరేషన్ డైరెక్టరు ఘంటసాల ప్రభాకరరావు, చేపేని రంగారావు, రంభ ఉమామహేశ్వరి, సొంగల మహేశ్వరరావు, పెంకి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రామారావుగూడెంలో 'మేమంతా సిద్ధం'

దెందులూరు : రాబోయే ఎన్నికల్లో రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుకు ఎమ్మెల్యేగా కొఠారు అబ్బయ్యచౌదరికి, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్‌కు వేయాలని వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని అన్నారు. మంగళవారం రామారావుగూడెంలో సర్పంచ్ పర్వతనేని శ్రావణి సుధీర్, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పర్వతనేని వెంకట్రాజు, ఎంపీటీసీ కాలి ఇస్రాయేలు, నాయకుల ఆధ్వర్యంలో మేముంతా సిద్ధం కార్యక్రమం నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లికి వైఎస్సార్ సీపీ అమలు చేసిన సంక్షేమం పథకాలను వివరించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కస్సె శ్రీనివాసరావు, పార్టీ నాయకులు పేరం ప్రసాద్, పర్వతనేని నరేంద్ర, పుల్లా శివప్రసాద్, కొత్తపల్లి సుబ్బారావు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



రామారావుగూడెంలో ప్రచారం నిర్వహిస్తున్న కామిరెడ్డి నాని, సర్పంచ్ పర్వతనేని శ్రావణి, సుధీర్, నాయకులు

బడుగు, బలహీన వర్గాలకు ప్రాధాన్యం

పెదపాడు: బడుగు, బలహీన వర్గాలకు పెద్దపీట వేసింది ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని పెదపాడు సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్ తెలిపారు. పెదపాడు మండలంలోని కొత్తూరు గ్రామ శివారు అందేఖాన్ చెరువు, వీరభద్రపురం గ్రామాల్లో మంగళవారం నేను సిద్ధం మా ఊరు సిద్ధం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పేదలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన కొనసాగేందుకు ప్రజలంతా ఫ్యాను గుర్తుపై ఓటు వేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కోట గోవర్ధన్, ఎంపీటీసీ కర్రె అనీల్‌కుమార్, వార్డు మెంబరు కొమ్మిన రాజారత్నం పాల్గొన్నారు.



కొత్తముప్పర్రు శివారు అందేఖాన్ చెరువులో ప్రచారం చేస్తున్న అక్కినేని రాజశేఖర్

ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి విశేష స్పందన



భీమడోలులో వృద్ధురాలిని పరీక్షిస్తున్న వైద్యులు కె.శ్రీలక్ష్మీ, జాహ్నవి



కంటి పరీక్ష చేస్తున్న వైద్య నిపుణుడు

భీమడోలు: ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమంలో భాగంగా భీమడోలు సచివాలయం–1 వద్ద మంగళవారం నిర్వహించిన వైద్య శిబిరానికి రోగులు పోటెత్తారు. పంచాయతీ పరిధిలోని ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ శిబిరంలో భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరిండెంటెంట్ డాక్టర్ ఎం.సునీతతో పాటు పలు విభాగాలకు చెందిన వైద్య బృందం రోగులను పరీక్షించారు. ఆరోగ్య సూత్రాలు, తీసుకోవాల్సిన ఆహార నియమాలను వివరించారు. ఈ సందర్భంగా భీమడోలు సీహెచ్‌సీ పర్యవేక్షకురాలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలన్నదే లక్ష్యమన్నారు. ప్రతి ఒక్కరూ ఈ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం శిబిరానికి వచ్చిన బాలింతలు, గర్భిణులు, కౌమర, నవజాతల సంరక్షణ తదితర అంశాలకు సంబంధించి రోగులకు సునీత పరీక్షించి వారికి ఉచితంగా మందులను అందించారు. జనరల్ విభాగపు వైద్యులు కె.శ్రీలక్ష్మీ, ఆర్.జాహ్నవి, ఎముకలకు సంబంధించిన వైద్యులు సీహెచ్ సుధాకర్ పరీక్షలు చేసి ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు. ఓ వెంకటరెడ్డి కంటి పరీక్షలు చేశారు. శిబిరంలో 415 మంది హాజరు కాగా వారికి వివిధ పరీక్షలు చేశారు. కంటి వైద్య నిపుణులు 6 మందికి కంటి పరీక్షలు చేసారు. రక్తపరీక్షలు చేసి ఉచితంగా మందులను అందించారు. ఆపరేషన్ల కోసం నలుగురిని రిఫర్ చేశారు. గ్రామ సచివాలయ సిబ్బంది, సూపర్‌వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

బియ్యం, పండ్లు పంపిణీ

భీమడోలు: మానవ సేవే మాధవ సేవ అనే సిద్ధాంతాన్నినమ్మి దివ్యాంగుల అభ్యున్నతికి పాటు పడుతున్న దాతలు సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. గుండుగొలను శ్రీ విఘ్నేశ్వర దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం 55 మంది దివ్యాంగులకు దాతల ఆర్థిక సాయంతో సామాజిక సేవా కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి చెందిన దాట్ల సూర్యనారాయణరాజు జ్ఞాపకార్థం ఆయన అల్లుడు ఇందుకూరి సత్యనారాయణరాజు సాయంతో సన్న బియ్యం, పండ్లు, పోషకాహారం అందించారు. దివ్యాంగులకు దివ్యాంగుల పునరావాస కేంద్రం ఆధ్వర్యంలో ఫిజియోథెరపిస్ట్ జి.రాంబాబు, కంబయ్యలు వారికి పలుఅంశాలపై అవగాహన కల్పించారు. ఫిజియోథెరపీ ద్వారా శారీర అంగాల్లో చలనం కలిగి సాధారణ స్థితికి చేరుకుంటాయన్నారు. ప్రతి ఒక్కరూ ప్రతి రోజూ ఫిజియోథెరపీలో వ్యాయమాలు చేసుకోవాలన్నారు. దివ్యాంగుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు మామిడిపల్లి నాగభూషణం, నిర్వాహకులు పేరిచర్ల శ్యామలరాజు, గేదెల శ్రీనివాసరావు, అరసంకల సోములు, రావి గంగరాజు సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని పాటించాలి



మాట్లాడుతున్న ఆర్వో ఖాజావలి

ఉంగుటూరు: ఉద్యోగస్తులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తూ.చ తప్పకుండా అమలు చేయాలని ఉంగుటూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఖాజావలి అన్నారు. మంగళవారం ఉంగుటూరులో వాసవీ కల్యాణ మండపంలో బీఎల్వోలు, వివిధ రకాల టీమ్‌లు, వీఆర్వోలు, ఎంపీడీవోలతో సమావేశం నియోజకవర్గ స్థాయిలో నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్వో ఖాజావల్లి మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ దృష్టి సారించి పని చేయాలని సూచించారు. నామినేషన్ల ప్రక్రియ నుంచి, ఈవీఎం యంత్రాలు స్ట్రాంగ్ రూమ్‌కు వెళ్లేంత వరకు విధి నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరించాలని లేకుంటే ఇబ్బందులకు గురవుతారని హెచ్చరించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. త్రీ టైర్ బందోబస్తు ఉంటుందని స్పష్టం చేశారు. డిస్ట్రిబ్యూషన్ మొదలుకుని పోలింగ్ స్టేషన్‌కు వెళ్లేంత వరకు అప్రమత్తంగా పని చేయాలన్నారు. 144 సెక్షన్ అమలులో ఉందని స్పష్టం చేశారు. ఏదైనా సమస్య వస్తే కేంద్రీయ కార్యాలయానికి రిపోర్ట్ చేయాలన్నారు. గణపవరం సీఐ రవికుమార్ మాట్లాడుతూ సమస్యాత్మక గ్రామాల్లో ఇప్పటికే పోలీసు భద్రతా దళాలు కవాతులు నిర్వహిస్తున్నాయన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో ఎన్నికల సహాయ అధికారులు వెంకట శివయ్య, జి.వరహాలయ్య, కె.పోసిబాబు, వై.రాంబాబు, నిడమర్రు సీఐ ఎంవీ సుభాష్, ఎంపీడీవోలో స్వర్ణలత, శివ, నారాయణ, శివ రామకృష్ణ, సెక్టార్ అధికారులు, బూత్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

దెందులూరు: ఎన్నికల నేపథ్యంలో మంగళవారం దెందులూరు జాతీయ రహదారిపై ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు వాహన తనిఖీలు నిర్వహించారు. దెందులూరు చెక్‌పోస్టు, సోమవరప్పాడు, గుండుగొలను హైవే వద్ద తనిఖీలు దెందులూరు తహసీల్దార్ వీ.జితేంద్ర తనిఖీ చేశారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	18
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	38
ఏలూరు – బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	43
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	26

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్	21.45	4820	19
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	11
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	18
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	29
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	23
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	16
ఏలూరు –తిరుపతి	16.00	4830	34